శ్రీ ఎ. ఎ. బి. రామారావు

# సులోచనాలు

తాతయ్యంటే నాకు ప్రాణం.

మామ్మ నన్ను ముద్దు చేస్తుంది.

—శెలవలకి మావయ్య వచ్చి ఊరు తీసుకెళతానన్నాడు.

''అమ్మో! బాబీ లేకపోతే క్షణం గడవదు'' — తాతయ్య వెంటనే అనేశాడు.

''ఎండల్లో వాడెందుకురా! వాల్తేరునుంచి బిలాస్‌పూర్. అక్కడ వాళ్లిక్కడకు రావడం మంచిది కాని ఈ చల్లదనంలోంచి. బాబోయ్, ఆ ఎండల్లోకా!''

—'మీ మామ్మ కాళ్లల్లో కర్ర పెట్టేసిందిరా' అన్నాడు మావయ్య నాతో. ఇవేవీ పట్టనట్టు నాన్నగారు అట్టమీద అస్థిపంజరం బొమ్మ ఉన్న ఇంగ్లీషు పుస్తకం చదువుకుంటున్నారు.

అమ్మ ఎప్పుడూ ఏవో పనుల గొడవలో ఉంటుంది. నా గురించి పట్టించుకోనే పట్టించుకోదు. ''వెధవ. అర్ధరాత్రి వరకూ అలా తిరుగుతాడు. రాత్రయితేమాత్రం నా పక్క వదలడు'' అంటుంది. చెల్లంటే అమ్మకి ముద్దు. నే నడిగితే కీ ఇచ్చేకారు కొనలేదు కాని చెల్లాయికి మాత్రం ఏడు రూపాయలిచ్చి రబ్బరు బొమ్మ కొనేసింది. ఆ గయ్యాళి అది నాకొకసారి చూడడానికైనా ఇవ్వకుండా దాన్ని కౌగలించుకునే తిరుగుతుంది.

''వీడికి జోళ్లపిచ్చి'' అంటుంది పిన్ని.

''—మూడు జతల జోళ్లుండగా ఇంకా ఎన్ని కావాలిరా నీకు!'' అని ఊరికే కోంబడుతుంది.

స్కూలు యూనిఫారమ్‌తో బూట్లుండాలా? ఆటలకి కెట్సు. మరి మామూలుగా ఎక్కడికైనా వెళ్ళడానికి చెప్పులు. సరదాగా తొడుక్కోడానికి బెల్టు జోడు కావాలన్నాను.

''పోన్లేవే! పాతిక రూపాయలు పడేస్తే వస్తాయి !''— పిన్నినీ, అమ్మనీ కసిరేసి నాన్నగారు కొన్నారు. ఇంతకీ పిన్నిని నేనడిగింది ఇంతోటీ భాగ్యమేం కాదు—రజని అన్న క్లాస్‌మేట్ కొనుక్కున్న బెల్టుజోడు.

అప్పుడప్పుడూ కసురుకున్నా నేనంటే నిజంగా పిన్నికిగారమే.

బాబాయి పిన్నికి చెప్పమన్నమాట ఎవరూ వినకుండా డాబా మీద చెబుతాగా—అందుకని.

—''అభిమానాలంటే మీవేనే. మిమ్మల్ని చూస్తే పింతల్లి పెత్తల్లి పిల్లలనుకోరు. ఒకేతల్లి పిల్లలనుకుంటారు మంచివాళ్లు ఏ రోజుల్లోనూ ఉన్నారు.''

—మామ్మ ఎవరైనా వచ్చినపుడు చెబుతూ ఉంటుంది.

కాని మామ్మంటే అమ్మకెందుకు భయం? సినిమాకు నన్ను తయారుచేసి తనూ ముస్తాబై నాన్నగారు వచ్చిన తరువాత రంయ్‌మని పోదామని నేను స్కూటరు చుట్టూ తిరుగుతూ ఉంటే మామ్మ 'రేపు వెళుదువ్‌గానిలేవే' అనేస్తుంది.

ఎందుకో అర్థంకాదు. చెల్లికి పక్కలు వెచ్చగాఉంటే సినిమాకి ఎందుకు వెళ్లకూడదు?

బాబాయి వచ్చాడు బ్యాంకునుంచి. నే పెద్దయితే బాబాయి ఉజ్జోగంవే చేస్తా. ఎంచక్కా కొత్తనోట్లు, రూపాయి కాసులూ ఎప్పుడు కావాలంటే అప్పుడు తెచ్చుకోవచ్చు.

నేను సినిమా కెళ్లాలి—స్కూటరుమీద. బాబాయి నడిగాను ''తీసుకెళ్లవా?'' అని. బాబాయి నన్ను మేడమీదకి తీసుకెళ్లాడు. ''ఒరేయ్ బాబీ, సినిమాకింకా అరగంట టైముంది మనం ఇక్కడ నుంచి జగదంబా కెళ్లడానికి ఎంత టైము పడుతుందిరా ?''

''నాలుగున్నర నిమిషాలు.''

''కరెక్ట్! తడుముకోకుండా చెబుతావ్. అందుకే నువ్వంటే నాకిష్టం'' అంటాడు బాబాయి.

''మరేం మరేం...నువ్వు'' బాబాయి జేబులోంచి క్యాడ్‌బరీ చాక్లెట్ తీశాడు.

''ఎంటీ, పిన్నినీ సినిమాకు రమ్మన్నా?''

''ఓరి, పిడుగా! పిన్ని కొట్టదూ?''

''నన్ను కొట్టదులే'' చాక్లెటు లాక్కుని ఇన్ గేట్‌వైపు పరిగెత్తబోయా. ఆరయితే పిన్ని లైబ్రరీనుంచి వచ్చేస్తుంది. గేటుదాటి ఈపాటికి మా పిఠాపురం బీచి క్వార్టర్సుడౌన్ దిగుతూ ఉంటుంది. దోవలోనే పిన్నికి బాబాయి ప్రోగ్రాం చెప్పేయాలి.

''—బాబీ నా జోడు ఇలా ఇవ్వరా!?''

నేను గదిలోంచి దూసుకుపోతుంటే అడిగాడు తాతయ్య. అందరికీ ఒక కళ్లజోడే ఉంటుంది తాతయ్యకిమాత్రం రెండు. ఎప్పుడూ నన్ను కళ్లజోడు తెమ్మని కేకేస్తూనే ఉంటాడు తాతయ్య. నేను వెనక్కి వెళ్లి ఇవ్వకపోతే ''భడవా, వేలెడులేవు. చెప్పినమాట వినవూ! ఇటు పిలుస్తే అటు పలుకుతావా!'' అంటూ చెవి మెలేసేస్తాడు. తాతయ్యకు కోపంవస్తే నాకు ప్రాణం కడంటి పోతుంది. ''నువ్ మీ నాన్న గదిలోకి పో!'' అని మామ్మ అనేస్తుంది, తాతయ్య చెప్పిన పని వెంటనే చేసెయ్యకపోతే! నాన్నగారి గదిలో పడుకుంటే సగం రాత్రి నాకు గొప్ప భయం వేస్తుంది. ఒక్కడినే పడుకుంటే నాకు నిద్దరాదు. భయం భయం కలలొస్తాయి. అమ్మ సగంరాత్రి లేచి వెళ్లిపోతుంది.

ఆదివారం.

తాతయ్య పక్కనుంచి మెల్లగా లేచి మేడమీదకి వెళతా. తాతయ్య లేచేలోగా కళ్లజోడు మళ్లీ అక్కడ పెట్టేయ్యాలి. తాతయ్య కళ్లజోడు పెట్టుకుని అద్దంలో చూసుకుంటే...

''ఒరేయ్ శంకరం! పిల్ల బంగారం లాంటిదిరా! పెళ్లిమాట ఎత్తవేం? దాని వెనకాతల తిరగొచ్చు కాని, పెళ్లిచేసుకోకూడదేం? ఇంకెందుకూ ఆలస్యం?''

—తాతయ్య ఎప్పుడూ బయటకు అనని మాటలు అద్దంలోకి అంటున్నా.

''ఒరేయ్, పెద్దాడా! నువ్వూ నేనూ చెబితే వాడు వినడు—కోడలిచేత చెప్పించరా! ఓయ్ శుద్ధ మొద్దావతాంమా ఆడవాళ్లు ఇల్లాంటి వాటికి పూనుకోవాలి. రేప్పొద్దున్న నిన్నే అంటారందరూ! ఈడొచ్చిన పిల్లను ఇంటిలో ఉంచుకుని అన్నీ బాగుండగా ఇంకెందుకూ ఆలస్యం అని. నువ్ వాడికి చెప్పు. ఎంతైనా తల్లిమాటే వింటారు గుంటలు...''

కళ్లజోడు ముక్కుమీదకి జారిపోతోంది.

''ఒరేయ్, భడవా, తాతగారి జోడు పెట్టుకుని ఏంనిటా చూపు! పగలకొడతావ్ జాగ్రత్త!''

—మామ్మ వచ్చింది గదిలోకి.

''ఓయ్, ఇటు చూడు! కాస్త కాలురాద్దూ!''— తాతయ్య పిలిచాడు మామ్మని. నే కళ్ళజోడు అక్కడపడేసి బాబాయి గదిలోకి వెళదామని బయలుదేరా.

''బాబీ, అమ్మ మైసూర్‌పాకు చేస్తోంది!'' పిన్ని వంటింట్లోకి పిలిచింది.

''నాకేం అక్కర్లా!'' నేను వంటింట్లోకి వెళితే ఎంచక్కా మేడ ఎక్కిపోదామని పిన్ని గొడవ.

నాన్నగారు నిద్రపోతున్నారు.

బాబాయి పెద్ద ఆఫీసరుకావాలని ఏదో పరీక్షకి చదువుతూ ఉంటాడు రోజూ. నేను లోపలకు వెళ్లేసరికి ''ఏరా, పిన్నేం చేస్తోంది?'' అని అడిగాడు.

''అమ్మ మైసూరుపాక్ చేస్తుంటే నుంచుని చూస్తోంది. తాతయ్య గదిలోకి మామ్మ ప్రవేశించింది. నాన్నగారు నిద్రపోతున్నారు. చెల్లి నిద్రపోతోంది. బాబాయ్ పరీక్షలు గదా, చదువుకోడంలేదేం?''

— టేబిలుమీద ఉన్న బాబాయి కళ్లజోడు తీసిపెట్టుకున్నా.

''సరోజా! ఎంత అందంగా ఉన్నావ్! మీ నాన్నతో చెబుదూ! ఆఫ్టర్‌ఆల్, ఇరవై... వెధవ స్కూటరుమీద ఎండ, ఎదురుగాలి — ఎంచక్కా కారుంటే నిన్ను లైబ్రరీ దగ్గర దించేసి నేను బ్యాంకుకు పోతా! ప్లీజ్!''

—''ఏమిట్రా ఫూల్! అలా మాటాడుతున్నావ్!'' బాబాయి కసురుతాడు. బాబాయి కళ్లజోడు తీసి నే బల్లమీద పెట్టేస్తా.

''ఇతరులు మాటాడుకుంటున్నప్పుడు—ముఖ్యంగా పెళ్ళికాని అబ్బాయీ, అమ్మాయి మాటాడుకుంటున్నప్పుడు వినకూడదు. విన్నా, ఇలా ఆ మాటలు మళ్లీ సినిమా డయిలాగుల్లా వల్లించ కూడదు!''

''మరి నాన్నెందుకూ అమ్మతో మాటాడ్డానికి నన్ను గదిలోనుంచి పంపేస్తారు? మామ్మ ఏమో...''

—పిన్ని ఎప్పుడు లోపలకొచ్చేసిందో...

''బాబీ! పక్కవాళ్లింట్లో పత్రిక ఉంది. ఓసారి తీసుకు రావూ?''

బాబాయి కళ్లజోడు నా ముక్కుమీద కొచ్చింది మళ్లీ.

''సరోజా! మీనాన్నగారితో చెప్పి ఇరవై...''

''చూడు శంకర్! ఆ వంటవాడిక్కూడా మనం చులకనై పోయాం...''

''ఒరేయ్ బాబీ!'' మామయ్య కసిరాడు. ''ఆ కళ్లజోడు ఇలా ఇచ్చెయ్యి!''

''పిన్నీ! చూడు!'' నాకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''నాతండ్రి లేదురా! కిందకు పోదాం పద! ఎంచక్కా కారమ్స్ ఆడుకుందాం.''

మామ్మా, బాబాయీ, అమ్మా అందరూ నన్ను కసిరేవాళ్లే. వాళ్లు ముద్దుచెయ్యడానికి చెల్లి ఉంది. నాకు ఏడుపొస్తుంది.

''బాబీ! నీకు మాంచి కథ చెబుతా రా!''

పిన్నిని బాబాయి చెయ్యిపట్టుకు లాగాడు. బుగ్గ కొరికేశాడు.

''అబ్బ! ఉండండి. కారులేకపోతే పెళ్లి చేసుకోకూడదా! పెళ్లిచేసుకున్న వాళ్లందరికీ కార్లే ఉన్నాయా? నీ జీతంతో కారు రాదూ! పద బాబీ, పోదాం! బాబాయికి కారు పిచ్చి!''

''సరోజా!''

''ఎవరి వెర్రి వాళ్లకానందం! నాకంటె కారు ముఖ్యమైనప్పుడు ఓ కారునో, లారీనో కట్టుకుంటే సరి!''

—పిన్ని నన్ను చెయ్యిపట్టుకుని కిందకు తీసుకొచ్చింది. మైసూరుపాకు పళ్లెంలో ఫేనుకింద చల్లారుతోంది.

''అమ్మేది?''

''పడుకుందేమోలే! ఎవరి గొడవలు వాళ్లవి. మనం ఎవరిక్కావాలి? రా, మనం ఆడుకుందాం.''

—కాయిన్ వెయ్యకుండా ముందు రెడ్ వేసేసింది పిన్ని. — పిన్ని పరాకుగా ఆడుతోంది. నాకూ నిద్రొచ్చేస్తోంది.

ఒకాటే ఆవలింతలు.

''పిన్నీ నిద్రొస్తోంది!''

''రా, నే బజ్జోపెడతా!''

పిన్ని నాపక్కపడుకుని నన్ను జోకొడుతోంది.

బాబాయ్కి కారంటే ఎంత పిచ్చి! నాన్నగారు బాబాయితో ఎందుకు మాటాడరు? మామ్మ నేను మేడమీద కెళ్లేసరికి నన్ను ఎందుకు పిలిచేస్తుంది? దానికి రబ్బరు బొమ్మకొని అమ్మ నాకు కారు ఎందుకు కొనదు? చెల్లిని గిచ్చితే అమ్మ నా చెంప బద్దలు కొట్టింది? పిన్ని బుగ్గ కొరికితే బాబాయి నెవరూ ఏమీ అనరు ఎందుకని? అసలు పిన్ని ఏడవదేం?

—బాబాయి కారు డ్రైవ్ చేస్తున్నాడు. పిన్ని పక్కనేకూచుని నేను పిన్ని పాట వింటున్నా. వెనకసీట్లోంచి చెల్లి ముందుకొచ్చేస్తానంటోంది.

''అమ్మదగ్గరే కూచోవే' అంటున్నా చెల్లిని...


# ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

## పండితారాధ్య చరిత్ర

డాక్టరు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాసిన పీఠికతో అమ్మకానికి సిద్ధంగావుంది. వెల రు 15-00

(పోస్టేజి అదనం)

## బసవ పురాణము

బైండుచేసిన రంగుల అట్టతో కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావుగారి 'ప్రస్తావన'తో కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావుగారి విపుల పీఠికతో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల రు. 7-50

(పోస్టేజి అదనం)

## భగవద్గీత

కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన వ్యాఖ్యానములో బైండుచేసి అమ్మకమునకు సిద్ధముగా నున్నది. వెల రు. 7-50

(పోస్టేజి అదనం)

ఆంధ్రపత్రిక ఏజెంట్లద్వారా కూడా తెప్పించుకోవచ్చు.

............................వ్రతులకు............................

మేనేజరు,

ఆంధ్రపత్రిక, గాంధీనగర్, విజయవాడ-3




5